విపక్షాలను తిట్టడమే రేవంత్ పని



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న లక్ష్మారెడ్డి, వివేకానంద్

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కుత్బుల్లాపూర్: సంక్షేమాన్ని విస్మరించి ప్రతిపక్ష పార్టీలను తిట్టడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని, ఆయనకు తగిన బుద్ధి చెప్పాలని మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. చింతల్ డివిజన్‌లో శనివారం ఎమ్మెల్యే వివేకానంద్ కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిందని, కానీ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారమిచ్చి పెద్ద తప్పు చేశామని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేవైఎం కన్వీనర్ సాయిరాంరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీకి చెందిన దాదాపు 200 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి లక్ష్మారెడ్డి, వివేకానంద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నేతలు మహ్మద్ రఫీ, మక్సూద్ అలీ, వెంకటేశ్‌గౌడ్, బస్వరాజు, స్వప్న, స్వర్ణలత, శ్రీకాంత్, మనీశ్, భాగ్యలక్ష్మి, తేజ, రాంరెడ్డి, సోమిరెడ్డి, అనిల్‌రెడ్డి, సుచిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు బీజేపీలోకి 'హ్యాట్రిక్ కార్పొరేటర్'

నడ్డా సమక్షంలో శేషగిరి చేరికకు రంగం సిద్ధం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ హ్యాట్రిక్ కార్పొరేటర్ రావుల శేషగిరి బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నారు. గత కొన్ని రోజులుగా బీజేపీ నాయకులు ఆయనను రహస్యంగా కలుస్తూ మంతనాలు జరుపుతూ వస్తున్నారు. దీంతో శేషగిరి బీజేపీలో చేరేందుకు మొగ్గుచూపగా, అంతలోనే ఈ విషయం బీఆర్ఎస్ అధిష్ఠానం దృష్టికి వెళ్లింది. ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ రాజు రెండు రోజుల క్రితం రంగంలోకి దిగి నచ్చజెప్పడంతో ఆయన వెనక్కి తగ్గారు. మళ్లీ మనసు మార్చుకొని బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 29న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నగరంలో ఎన్నికల పర్యటనలో భాగంగా నిజాంపేట్‌కు వస్తుండటంతో ఆయన సమక్షంలో బీజేపీ కండువా కప్పుకోనున్నారు.



రావుల శేషగిరి

హ్యాట్రిక్ కార్పొరేటర్‌గా...

స్లమ్ ఏరియాలు ఎక్కువగా ఉన్న గాజులరామారం డివిజన్‌లో శేషగిరికి మంచి పట్టుంది. కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీగా ఉన్న సమయంలో కౌన్సిలర్‌గా పని చేసిన ఆయన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన అనంతరం వరుసగా మూడు సార్లు కార్పొరేటర్‌గా హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన బీజేపీలోకి వస్తుండటంతో స్థానికంగా పార్టీ మరింత బలోపేతం కానుందని ఆ పార్టీ నేతలు ఆనందం వ్యక్తం చేయగా, స్థానికంగా బీఆర్ఎస్ పార్టీకి ఎదురుదెబ్బేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రోగ్రెస్ కార్డులు



విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జగద్గిరిగుట్ట: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు ఆట, పాటల ద్వారా విద్యను అందిస్తున్నామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ కూన మహాలక్ష్మినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో స్నాతకోత్సవం నిర్వహించి విద్యార్థులకు మార్కుల మెమోలు అందజేశారు. కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీచర్లు విజయలక్ష్మి, తులసి, అరుణ, జరీనా, కరుణ, నర్మద తదితరులు పాల్గొన్నారు.

గాలికొదిలేసిన పారిశుధ్య నిర్వహణ

రంగారెడ్డినగర్: గాంధీనగర్ పారిశ్రామికవాడలో పారిశుధ్యనిర్వహణను ఐలా అధికారులు గాలికొదిలేశారు. పారిశ్రామిక ప్రాంతంలోని రోడ్ల వెంబడి రోజుల తరబడి పేరుకుపోతున్న చెత్తాచెదారమే ఇందుకు నిదర్శనంగా పేర్కొనవచ్చు. రంగారెడ్డినగర్‌కు ఆనుకుని ఉన్న గాంధీనగర్ పారిశ్రామికవాడ రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది.. ఒకవైపు ఓపెన్ డ్రైనేజీలో వ్యర్థాలు, మరోవైపు రోడ్డు పక్కన చెత్తచెదారాలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతం దుర్గంధభరితంగా మారుతోంది. పరిశ్రమల నిర్వాహకుల నుంచి లక్షల్లో పన్నుల రూపంలో వసూలు చేస్తున్న ఐలా అధికారులు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, చెత్తను ఎప్పటికప్పుడు తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు పారిశ్రామికవేత్తలు విమర్శిస్తున్నారు.



గాంధీనగర్ పారిశ్రామికవాడలో రోడ్లపై పేరుకుపోయిన వ్యర్థాలు

రెంటల్స్.. జర జాగ్రత్త!

బ్రోకర్స్ యాప్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి

- ఇళ్ల ఫొటోలు చూసి మోసపోవద్దు
- చెక్ చేసుకోకుండా గూగుల్ పే, ఫోన్‌పే చేయొద్దు
- మాదాపూర్ క్రైం సీఐ రమేష్ నాయుడు



మాదాపూర్: ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయి. చదువుకున్నవారు, ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఈ మోసాల బారినపడుతున్నారు. లక్షల్లో డబ్బు పోగొట్టుకుంటున్నారు. జాబ్, లోన్, ఇన్‌స్టా, రిలేషన్ షిప్, డేటింగ్, మ్యాట్రిమొని, లాటరీ, హనీట్రాప్ పేరిట మోసగిస్తున్నారు. ఇదిలా ఉంటే నగరంలో అద్దె ఇళ్ల కోసం పలువురు బ్రోకర్‌లను, బ్రోకర్స్ యాప్‌లను వినియోగిస్తున్నారు. ఐటీ ప్రాంతం కావడంతో ఎక్కువ మంది ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో ఇళ్ల కోసం యాప్‌లను సంప్రదిస్తుండగా వారికి ఆకర్షణీయమైన ఇళ్ల ఫొటోలను, వివరాలు పంపించి వారి వద్ద నుంచి ఆధార్‌తో పాటు కొంత నగదును తీసుకుని రీఫండ్ అని చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. నగదు రాగానే ఫోన్‌లను స్విచ్ ఆఫ్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు పబ్లిక్ ప్రాంతాలలో, కార్యాలయాలలో, కమ్యూనిటీలలో, కాలనీలలో, అసోసియేషన్‌లలో ఆన్‌లైన్ మోసాల గురించి, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నామని మాదాపూర్ క్రైం సీఐ రమేష్ నాయుడు తెలిపారు. సైబర్ బారిన పడి డబ్బు పోగొట్టుకుంటే గంట లోపల ఫోన్ 1930కి ఫిర్యాదు చేస్తే డబ్బు రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. పాస్‌పోర్టులు, పాన్‌కార్డులు, డ్రగ్స్ మీరు పంపించిన పార్సిల్‌లో ఉన్నాయి అని ఫోన్ కాల్స్‌తో భయభ్రాంతులను చేసి డబ్బు కాజేస్తున్నారని ఇలాంటి వాటిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సైబర్ మోసాలపై ఆయన పలు విషయాలను సాక్షికి వెల్లడించారు.

ప్ర: ఎక్కువగా ఎలాంటి సైబర్ నేరాలు జరుగుతున్నాయి.?

జ: జాబులు ఇప్పిస్తామని, లోన్‌కు ఎలిజిబుల్ ఉందని, గిఫ్ట్ ఓచర్లు గెలుపొందారని, రిలేషన్‌షిప్, చాటింగ్, పార్సిల్స్ లాంటి వినూత్న రీతిలో ప్రజలను భయపెట్టి నగదు వసూలు చేస్తున్నారు. డబ్బు వచ్చిన తరువాత ఫోన్‌లు స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏదైన సమస్య వస్తే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయాలి.

ప్ర: రెంట్ కోసం వచ్చిన వారిని ఎలా మోసగిస్తున్నారు?

జ: మాదాపూర్ ఐటీ ప్రాంతం కావడంతో ఇళ్ల వెతుక్కోవడం కష్టంగా ఉండడంతో చాలామంది బ్రోకర్‌లను, యాప్‌లను వినియోగిస్తున్నారు. అందమైన ఇళ్లు చూపించి రెంట్ తక్కువ అని చెప్పి వారి వద్ద నుంచి సెక్యూరిటీ డిపాజిట్ 2వేలు, ఆధార్ కార్డు ఇవ్వాలని నమ్మబలికి వారి వద్ద నుంచి డబ్బును తీసుకుని ఫోన్ ఆఫ్ చేస్తున్నారు. చాలా మంది ఇలా మోసపోతున్నారే తప్ప ఫిర్యాదులు ఇవ్వడం లేదు. ఇలాంటి విషయాలపై ఫిర్యాదు చేయాలి.

ప్ర: సైబర్ బారినపడి డబ్బు పోగొట్టుకుంటే రికవరీ చేయడమెలా?

జ: సైబర్ మోసాలలో భాగంగా అకౌంట్ నుంచి డబ్బులు కట్ అయితే వెంటనే బాధితులు తెలంగాణ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఫోన్ 1930ని సంప్రదించి వెంటనే అకౌంట్ డిటెయిల్స్ ఇవ్వాలి.దీనినే గోల్డెన్ అవర్ అంటారు.అలా చేయడం వల్ల వేరే వారి అకౌంట్‌ని ఫ్రీజ్ చేయడానికి అవకాశం ఉంటుంది.ఆలస్యం చేస్తే ఉపయోగం ఉండదు. వెంటనే చేయడం వల్ల అకౌంట్‌లో నుంచి పోయిన డబ్బును తిరిగి తీసుకురావచ్చు.

ప్ర: పోగొట్టుకున్న ఫోన్‌లను కనిపెట్టడం ఎలా?

జ: ఎవరైనా తమ ఫోన్‌లను పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి ఫోన్‌లను కనిపెట్టవచ్చు. ఫోన్ పోగొట్టుకున్న వారు పోర్టల్‌లో పోయిన సెల్‌ఫోన్ వివరాలను నమోదు చేయాలి. సంబంధిత పోలీస్ అధికారులు ఫోన్‌లను ట్రేస్ చేస్తారు. వేరేవారు ఉపయోగించకుండా పోర్టల్ ద్వారా బ్లాక్ చేసుకోవడానికి వీలుంటుంది. దొరికిన తరువాత అన్‌బ్లాక్ చేసుకోవచ్చు.

సంగీత కచేరి

మాదాపూర్: అన్నమయ్య కీర్తనలతో కళాకారులు సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం చైతన్య లహరి మ్యూజిక్ అకాడమీ గురువు లహరినాథ్ శిష్యబృందం సంగీత కచేరీ చేశారు. బ్రహ్మమొక్కటే, నీవల్ల గుణదోష, కొమ్మలాల ఎంతవాడే, గోవింద గోవింద, కొండలలో నెలకొన్న కీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. వీరికి వయోలిన్ ఎస్. అయ్యప్ప, మృదంగంపై హరికృష్ణ వాయిద్య సహకారాన్ని అందించారు.

ఏఐఎన్‌యూలో అరుదైన శస్త్ర చికిత్స

మాదాపూర్: పిల్లలకు ఒకసారి కిడ్నీలో రాళ్ళు వస్తే తర్వాత కూడా వైద్య పరీక్షలు చేయించాలని డాక్టర్ రాగూరి సూచించారు. మాదాపూర్‌లోని ప్రధాన ఆసుపత్రులలో ఒకటైన ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజి (ఏఐఎన్‌యూ)లో శనివారం అరుదైన శస్త్రచికిత్స చేశారు వైద్యులు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీలో రాళ్ళు ఏర్పడడం సర్వసాధారణమని ఒకే కుటుంబంలో తండ్రి, ఇద్దరు కుమారులకు అదే సమస్య ఉండడం అరుదు అని తెలిపారు. 13 సంవత్సరాల కుమారుడికి గతంలో కిడ్నీలో రాళ్ళు తొలగించినా మళ్ళీ తొలగించాల్సి వచ్చిందన్నారు. ఎడమవైపు మూత్ర పిండంలో ఒకటి, మూత్రనాళంలో మరొకటి, కుడివైపు ఒకటి ఉండడంతో రెండు వైపులా శస్త్ర చికిత్స చేసి తొలగించారు. పిల్లలకు ఆహారం విషయంలో నియంత్రణ పెట్టలేమని, సరిగ్గా నీళ్ళు తాగకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయని తెలిపారు.

'థండర్ ప్లస్ డీసీ ఫాస్ట్ చార్జర్' ప్రారంభం

మాదాపూర్: హైటెక్‌సిటీ ఎంఎంటీఎస్ స్టేషన్‌లో శనివారం ఎలక్ట్రిక్ 2వీలర్, 3వీలర్, 4వీలర్ కోసం థండర్ ప్లస్ చార్జింగ్ స్టేషన్‌ను నేషనల్ హైవే ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ ప్రోగ్రామ్ మెంబర్ అభిజిత్ సిన్హ ప్రారంభించారు. ఈవీ ఓనర్‌లు థండర్‌ప్లస్ ఈవీ చార్జింగ్ స్టేషన్లను గుర్తించడానికి థండర్‌ప్లస్ యాప్‌ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈవీ చార్జింగ్ స్టేషన్‌లను యుటిలిటీస్, రెసిడెన్షియల్, గేటెడ్ కమ్యూనిటీలు, వాణిజ్య సముదాయాలు, హైవేలు, పారిశ్రామిక ప్రాంతాలలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధి ఘనత కేసీఆర్‌దే: శంభీపూర్



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న శంభీపూర్ రాజు

దుండిగల్: తెలంగాణ రాష్ట్ర సాధనతోపాటు పదేళ్లపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావుదేనని ఆ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఆవిర్భవించిన బీఆర్ఎస్ పార్టీ ఎన్నో విజయాలు సాధించిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గండి మైసమ్మలోని జిల్లా కార్యాలయంలో పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూ పదేళ్ల కాలంలో రాబోయే రోజుల్లో తిరిగి అధికారం సాధించే దిశగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో పురోగతి

షాట్ ఇండియా సీఈఓ స్మిత్‌షా

రాయదుర్గం: ప్రపంచవ్యాప్తంగా గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం ఎంతో పురోగతి సాధిస్తోందని షాట్ ఇండియా సంస్థ సీఈఓ స్మిత్‌షా పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలో షాట్ ఇండియా స్టోర్‌ను శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమానమైన, వినోద అనుభవాలకు అత్యుత్తమ గమ్యస్థానంలో దేశంలో షాట్ ఇండియా గుర్తింపు పొందిందన్నారు. 2025 నాటికి గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో 40 శాతం మార్కెట్ స్థానం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం 550 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

డేటా సైన్స్‌కు పెరిగిన ప్రాధాన్యం

ముగింపు సదస్సులో మిసిసిపి వర్సిటీ ప్రొఫెసర్ ఆరాన్ డిడ్‌లేక్



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ ఆరాన్ డిడ్‌లేక్

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాలలో మూడు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. 'అప్లైడ్ మ్యాథ్‌మెటిక్స్ అండ్ అడ్వాన్స్‌డ్ డేటా ఎనలిటిక్స్ ఫర్ ఇండస్ట్రీ'అనే అంశంపై జరిగిన సదస్సు ముగింపు కార్యక్రమానికి యూఎస్ఏకు చెందిన మిసిసిపి యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆరాన్ డిడ్‌లేక్ హాజరై ప్రసంగించారు. మారిన సాంకేతికత నేపథ్యంలో ప్రస్తుతం ప్రతి పనిని కంప్యూటీకరిస్తున్నారని, దీంతో డేటా సైన్స్‌కు ప్రాధాన్యం పెరిగిందన్నారు. గ్రీన్‌బరో విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సత్యనారాయణ గుప్త గణితశాస్త్రంలో ఉపయోగించే కొలతల్లో లోపాలను సవరించే అంశంపై మాట్లాడారు. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్య శాస్త్రి కంప్రెసివ్ సెన్సింగ్ సిద్ధాంతం, అప్లికేషన్స్‌పై ప్రసంగించారు. ఇస్రో సైంటిస్ట్ సత్యనారాయణ డేటా అనాలసిస్, ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ తివారి, రష్యాకు చెందిన సమర యూనివర్సిటీ సైంటిస్ట్ ముఖేష్‌సింగ్ తమ పరిజ్ఞానాన్ని విద్యార్థులతో పంచుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

సుభాష్‌నగర్: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది... మెదక్ జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామానికి చెందిన పితాని ఆది(19) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇతనికి సంవత్సంన్నర క్రితం రమ్యశ్రీతో వివాహమైంది. కాగా, తన ఆటో మరమ్మతుల నిమిత్తం గాజులరామారంలోని ఓ మెకానిక్ దుకాణంలో రిపేర్‌కు ఇచ్చాడు. శనివారం ఉదయం మెకానిక్ షాప్‌నకు దోమడుగు నుంచి పల్సర్ బైక్‌పై వస్తుండగా సూరారం 'జ్యోతిమిల్స్'సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఆ బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఆది తలకు బలమైన గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి బంధువు సంజీవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన తొమ్మిదో తరగతి విద్యార్థి

నిజాంపేట్: బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సాంబశివరావు కుమారుడు మహేశ్(16) స్థానికంగా శివ నారాయణ స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. నాలుగు రోజులుగా మహేశ్ తన వెంట పాఠశాలకు స్క్రూ డ్రైవర్, కటింగ్ ప్లేయర్, కత్తెర స్కూల్‌కు తీసుకువెళ్తున్నాడు. వాటితో ఏం చేస్తున్నావని ఈ నెల 26న ఉదయం తల్లి పద్మ అడుగగా స్కూల్ బ్యాగ్ ఇంట్లో వదిలేసి సమాధానం చెప్పకుండా బయటకు వెళ్లి పోయాడు. సాయంత్రమైనా కుమారుడు ఇంటికి చేరుకోక పోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల, స్కూల్‌లో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. శనివారం విద్యార్థి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మహేష్ (ఫైల్)

సునీత విజయానికి సమష్టిగా పనిచేయాలి

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

నిజాంపేట్: మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి విజయానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సునీత మహేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ పార్టీ అడ్డా అని, మరోమారు ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి సత్తా చాటాలన్నారు. మేయర్ కొలన్ నీలారెడ్డి, నిజాంపేట్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కూన శ్రీశైలం గౌడ్, సునీత మహేందర్‌రెడ్డి కుమారుడు రినీష్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, జగద్గిరిగుట్ట డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు శనివారం ఒరుగంటి కృష్ణాగౌడ్, రషీద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి శ్రీశైలంగౌడ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



నిజాంపేట్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్. చిత్రంలో సునీతమహేందర్‌రెడ్డి తదితరులు



ముఖ్య నేతలతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

మీరు గెలవాలి సర్..!



మల్లు రవికి శుభాకాంక్షలు తెలుపుతున్న కూన శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: నాగర్‌కర్నూల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని శనివారం కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీగా మల్లు రవి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆధారాలు చూపని రూ.లక్షా 22 వేల నగదు

కుత్బుల్లాపూర్: ఎటువంటి ఆధారాలు చూపని రూ.లక్షా 22 వేల 570 నగదును పేట్‌బషీరాబాద్ పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పేట్‌బషీరాబాద్‌లోని మ్యాక్స్‌వెల్ షాపింగ్ మాల్ సమీపంలో శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. బైక్‌పై వెళ్తున్న సిద్దింకి సురేష్ అనే వ్యక్తిని ఆపి సోదా చేయగా రూ.1,22,570 నగదు పట్టుబడింది. సదరు నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు సీజ్ చేశారు. నగదు లావాదేవీలకు సంబంధించి ఆధారాలు సమర్పిస్తే తిరిగి ఇస్తామని పోలీసులు పేర్కొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం'

మూసాపేట: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని కూకట్‌పల్లి సీనియర్ నాయకుడు తూము మనోజ్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ సూచనలతో శనివారం మూసాపేట తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరగాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్క పెంటయ్య, శేఖర్ గౌడ్, రఘు, వేణు, సంతోష్, ఎల్లారావు, కొండలరావు, సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్, నయీమ్, సచిన్, కమ్రమ్మ, జయమ్మ, జేజమ్మ పాల్గొన్నారు.

30న ప్రజా ఉద్యమ అమర కళాకారుల సంస్మరణ సభ

పంజగుట్ట: ప్రజా ఉద్యమ కళాకారుల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజా ఉద్యమ అమర కళాకారుల సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు వేదిక వ్యవస్థాపకులు డోలక్ యాదగిరి, అముల యాదగిరి తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ఆయన విశ్వజన కళామండలి వ్యవస్థాపకులు మాస్టార్‌జీ, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కె.సి.ఎస్.ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణలో జరిగిన అన్ని ఉద్యమాలకు జీవం పోసింది కళాకారులే అని ప్రతి పల్లెలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేశారని గుర్తుచేశారు. అందర్నీ స్మరించుకునేందుకు ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సాయిరాం, ఖాశీం, దయ, ఇంద్రవెల్లి రమేష్ పాల్గొన్నారు.

ఐరా డ్యాన్స్ స్టూడియో ప్రారంభం

మోతీనగర్: మోతీనగర్‌లోని జనప్రియ ఎదురుగా రెండు అంతస్తులలో అన్ని ఆధునిక సాంకేతిక హంగులతో ఏర్పాటైన ఐరా స్టూడియోను శనివారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కూచిపూడి నృత్య గురువు డాక్టర్ సుధాకర్, శ్రవ్య మానస రీసెర్చ్ గురువర ప్రొఫెసర్ ఎం.ఎస్. శివరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ఐరా స్టూడియోను ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు సినీ, సంగీత రంగాల నృత్య కళాకారులతో కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ కళాకారులు అప్పాజీ, ఉత్తేజ్, రాజీవ్, సంజీవ్, ప్రభావతి వర్మ, జయా నాయుడు, నృత్య దర్శకులు శ్రీధర్ రెడ్డి, రచయిత సత్యదేవ్, నటరాజ్ భట్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఈ వేడుకలకు ఆహ్వానించామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐరా స్టూడియో శాఖ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నృత్య కళాకారిణి, డబ్బింగ్ ఆర్టిస్ట్ శ్రవ్య మానస భోగిరెడ్డి మాట్లాడుతూ ఐరా స్టూడియోలో నాటక సమాజాలు, సాంస్కృతిక సంస్థల వారు రిహార్సల్స్ కోసం, వీడియో షూట్‌లు, ఫొటో షూట్‌లు, వర్క్‌షాపులాంటివి నిర్వహించుకోవచ్చన్నారు. అదే విధంగా కళాకారులు తమ కళా ప్రతిభని పెంపొందించుకొని, ప్రదర్శించడానికి తగిన వేదిక లేని పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ కళాకారులు ఈ స్టూడియోను సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 7 నుంచి 10 గంటల మధ్య నిబంధనలకు లోబడి ఉపయోగించుకునే అవకాశం కల్పిస్తామని ఆమె తెలిపారు.

సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రామ్‌పై ఎంఓయూ

బంజారాహిల్స్: ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం వినూత్న సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రామ్ నిర్వహణకై కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీకి చెందిన కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్, ఫోర్టినెట్ పరస్పరం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు ఇరు సంస్థల ప్రతినిధులు శనివారం ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ మాట్లాడుతూ... సైబర్ సెక్యూరిటీ రంగంలో ఔత్సాహిక గ్రాడ్యుయేట్లను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ఈ ప్రోగ్రాం ఎంతగానో దోహదపడుతుందన్నారు. డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీ నైపుణ్యానికి ఎంతగానో డిమాండ్ ఉందన్నారు. ఆ డిమాండ్ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఎంఓయూ కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఫోర్టినెట్ ఏపీఏసీ రీజియన్ ప్రోగ్రామ్ హెడ్ కుసలా గాడే, కేఎల్‌హెచ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులను రక్షించుకోవాలి

సాక్షి, సిటీ బ్యూరో: సాంకేతిక ఆధారిత ప్రపంచంలో మేధో సంపత్తి హక్కులను పరిరక్షించుకోవడానికి సమగ్ర అవగాహన అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు. అసోచామ్ ఆధ్వర్యంలో రెసొల్యూట్ 4 ఐపి సహకారంతో ప్రపంచ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ దినోత్సవాన్ని మాదాపూర్‌లోని టీహబ్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోచామ్ స్టేట్ హెడ్ మచ్చా దినేష్‌బాబు మాట్లాడుతూ మేధో సంపత్తిని ప్రభావితం చేసే వినూత్న విధానాలను అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో ప్రణవ గ్రూప్ సొసైటీ సీటీఓ, ఈడీ బూరుగు రాంబాబు, ఓయూ ప్రొఫెసర్.జీబీ రెడ్డి, టీ హబ్ సీఈఓ శ్రీనివాస్, ఐపీఆర్ నిపుణులు పాల్గొన్నారు.